# సుడిగుండం

-ఎమ్. దామోదర్ రావు

రఘు ఇర్రిగేషన్ డిపార్టుమెంటులో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు. అతని భార్య సరోజ.

ధర్మారెడ్డి ఇర్రిగేషన్ మినిస్టర్ అయిన విషయం విని రఘు అట్టే మరచిపోయాడు. అతడు సరోజకు దూరపు చుట్టమని రఘుకు తెలీదు. అసలు సరోజకే తెలీదు. కానీ రాఘవులకు తెలుసు! అతను సరోజ తండ్రి. ఇర్రిగేషన్‌లో-అందులోనూ, ఎస్.ఆర్.బి.సి.సబ్-డివిజన్‌లో- యు.డి.సీగా

ధర్మారెడ్డి మినిస్టరయిన మరుసటి రోజే రాఘవులు అల్లుడింటి కొచ్చేసాడు. అల్లుడిలోని గాంధియన్ ప్రిన్సిపల్స్ అతనికి తెలుసు. అయినా ఏదోవిధంగా నచ్చజెప్పి అల్లుడ్ని ఎస్.ఆర్.బి.సి.లోకి పంపాలని తాపత్రయం.

ఎస్.ఆర్.బి.సి విషయం రఘు విని వున్నాడు. ఐదు-పది లక్షలిచ్చుకొని అక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటారట. సంవత్సరం తిరక్కుండా అంతకు అయిదింతలు సంపాదిస్తారట! ఇంకో సంగతీ వుంది. అక్కడ చాలా రిస్కీ వర్కు. అక్కడ పనిజేస్తూ సస్పెండ్ అయినోళ్లూ, హత్య కాబడిన వాళ్లూ కూడా వున్నారు. అంత రిస్కు తీసుకొని అందలానికెక్కాలన్న ఆశ రఘు మనస్తత్వానికే విరుద్ధం. అందులోనూ రఘు కలాటి విషయాల్లో సహస్రాంశ అనుభవం కూడా లేదు. సర్వీసంతా డిజైన్, సర్వేలలోనే గడిచిపోతోంది! కానీ రాఘవుల ప్రోద్బలానికి లొంగిపోయాడు.

రఘు ఆదాయం కేవలం జీతానికి పరిమితమైంది. ఇతరత్రా సంపాదన లేదు. అతివేగంగా రోజు రోజుకీ తరిగి, కరిగి మాయమైపోతున్న మధ్యతరగతికి చెందినవాడు. తనదంటూ ఏ ఆస్తీ లేదు. అందుకే తండ్రి పేరులో వున్న కాస్త పొలాన్ని అమ్మించేసాడు. ఇంటిని తాకట్టు పెట్టించాడు. భార్య మెడలోని బంగారం అమ్మేశాడు. ఎలాగైతేనేమి ఆరు లక్షలు పోగయ్యాయి. దక్షిణం తయారయ్యింది. దక్షిణ కుదిరాక ఉత్తరం సులభంగానే దొరుకుతుంది. దూరపు బంధుత్వం కూడా వుంది. రాఘవులు ధర్మారెడ్డి వుత్తరం సంపాదించాడు. రఘు ఎస్.ఆర్.బి.సి. ఛార్జి తీసుకున్నాడు!!

ఎస్.ఆర్.బి.సి రెస్ట్‌హౌస్ ఇంద్రభవనంలా వుంది. అందులో దిగాడు రఘు. ఇంకా ఫామిలీ షిఫ్ట్ చేయలేదు. జాయిన్ అయి రెండు రోజులే అయ్యాయి. ఇంకా క్వార్టర్స్ తీసుకోలేదు. తీసుకోవాలి. కొన్నిరోజులు లీవు పెట్టి వెళ్ళి సరోజ బాబులను తీసుకురావాలి. సామాను ట్రాన్స్‌పోర్టు చేయించాలి. ఇక్కడ వంటరిగా వుండడం చాలా ఇబ్బందిగా వుంది. ఉక్కిరి బిక్కిరి చేసే ఆఫీసు పనితో రోజంతా సతమతమయ్యాక సేద తీర్చడానికి సరోజ వుంటే ఎంత బావుండును!

ఆరోజు సాయంత్రం ఆఫీస్ అయ్యాక ముఖ్యమైన ఫైళ్లు రెస్ట్‌హౌస్‌కి తెప్పించి స్టడీ చేస్తున్నాడు రఘు. అప్పుడొచ్చాడు ప్రసాదు. అతను రఘుకి సబార్డినేటు. సెక్షనల్ ఇంజనీరు. కానీ సర్వీసంతా మేనేజ్‌మెంట్‌లో గడిపి అంతులేనంత సంపాదించాడు. ఎస్టీమ్ కార్లో తిరుగుతుంటాడు.

''నమస్తే సర్'' వస్తూనే రఘుని విష్ చేసాడు.

''నమస్తే'' రఘు తల ఫైళ్లోంచి ఎత్తలేదు. ఎస్టీమ్ రావడం కిటికీలోంచి చూసాడు. ఏమిటన్నట్లు కనుబొమ్మలెగరేశాడు.

''మీరు ఫ్యామిలీ షిఫ్ట్ చేయడానికి లీవుపెడుతున్నారట..''

''ఆ..అయితే?''

''కెనాల్ రన్ చేస్తున్నాం కదండీ... భూస్వాములూ ఎమ్మెల్యేలూ వచ్చిపోతూంటారు. ఫోన్లు చేస్తూంటారు. ఇ.ఇ కూడా బహుశా మీ లీవు సాంక్షన్ చేయరు. మీరు లీవు పెట్టకుంటే మంచిది. మీ ఫ్యామిలీ షిఫ్టింగ్ విషయం మాకొదిలేయండి. వదిన గార్ని తీసుకు రావడానికి రేపుదయం కారు పంపమంటారా?'' ప్రసాదు ఎటికేట్‌టుగా అడిగాడు.

''ఎవర్ని?''

''వదినగార్ని-అంటే మీ మిసెస్ గార్ని సర్''

రఘు మొదటిసారి తలెత్తి ప్రసాద్ ముఖంలోకి చూసాడు. అతనిది అధిక ప్రసంగమేమో అనిపిస్తోంది రఘుకి. ప్రసాదు అందుకున్నాడు.

''మీ వివరాలు తెలుసుకోవడం, మీ అవసరాలు చూడ్డం, మా బాధ్యత సార్! మీ ఇంట్లో వదినగారు, ఐదేళ్ళ బాబు వున్నారు. బోలారం, సెకండ్ లేన్‌లో వుంటున్నారు. వదినగారిది ధర్మారెడ్డిగారి తరపు బంధుత్వం. మీరు మొదటిసారి ఎస్.ఆర్.బి.సికి లేదా మేనేజ్‌మెంట్‌కి వస్తున్నారు. రాఘవులు, అంటే మీ మామగారు-మూడేళ్ల క్రితం ఇదే ఆఫీసులో రిటైర్ అయ్యారు...'' ప్రసాదు రఘు గూర్చి చెప్పుకుపోతున్నాడు. కానీ రఘుకది ప్రసాదుని గురించి పరిచయం లానే వుంది.

★★★

మరుసటి రోజు రఘు క్వార్టర్ తీసుకున్నాడు. తర్వాత రెండు రోజులకి సరోజ, బాబు ఎస్టీమ్‌లో వచ్చారు. సామాను కూడా ట్రక్‌లో వచ్చేసింది. అన్ని ఏర్పాట్లూ ప్రసాద్ చేసాడు. రెసిడెన్స్‌కి కొత్త ఫోను కూడా వచ్చింది. దాని ఖర్చు కూడా ప్రసాదే భరించాడు. రఘు డబ్బిస్తూంటే అతను తీసుకోలేదు. రఘుకి అంతకు మించి ఆలోచించే వ్యవధి లేదు.

పది రోజులలా గడిచాయి.

క్రితం రాత్రి జరిగింది నెమరు వేసుకుంటూ క్యాజువల్‌గా బయటకు చూసాడు. వరండా మెట్ల ప్రక్కన కొత్తగా మెరిసిపోతున్న బుల్లెట్ వుంది! ఎవరొచ్చారో?

''టిఫిన్ చేస్తారా?'' రఘు ఆలోచనల్ని భగ్నం చేస్తూ సరోజ.

రఘు తలని పైకీ క్రిందకీ వూపుతూ బయట ఎస్టీమ్ రావడం కిటికీలోంచి చూసాడు.

సరోజ టిఫిన్ తెస్తూంటే తలుపు చప్పుడైంది.

''కమిన్''

''గుడ్ మార్నింగ్ సర్'' ప్రసాదు విష్ చేస్తూ వచ్చాడు.

''రావయ్యా కూచో..సరూ ఇంకో ప్లేటు తీసుకురా.''

''ఇప్పుడే టిఫిన్ చేసి ఇలా వస్తున్నా..మీరు కానివ్వండి సర్''

రఘు బలవంతం చేయలేదు. తింటూ మధ్యలో ''ఏం పని తీసుకొచ్చావ్?'' అడిగాడు.

''మీరింత వరకూ ఇ.ఇ గారి బంగళాకి వెళ్లలేదనుకుంటాను-''

ఇ.ఇ పేరు వింటూనే రఘుకి స్పూన్‌లోని ఇండ్లీముక్క జారి పడింది.

''మీకు చెప్పాలనుకుంటూనే పనుల్లో మరచిపోయాను''-ప్రసాదు చెప్పుకుపోయాడు. ''ఇక్కడ జాయిన్ అయ్యాక కొన్నిరోజుల్లో ఇ.ఇ గార్ని మీరు ప్రైవేట్ విజిట్ చేయాల్సింది. అంటే మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోవాలి. ఆ పరిచయానికి నాందిగా ఏదైనా ప్రజెంట్ ఇవ్వాలి. ఇది ఇక్కడ రివాజు. మీరలా చేయలేదనుకుంటాను. అందుకే ఆయన రాత్రి చాలా హాట్ టెంపర్లో వున్నాడు. ఆయన తత్వమే అంత. రాత్రి జరిగింది మనసులో వుంచుకోకండి. ఎంత కర్కోటకుడో,

అంత జాలిగానూ వుంటాడు. ఈవాళ మీరెళ్లితే జోకులేస్తూ, నవ్వుతూ మాట్లాడగలడు. ఆయనకు వోడ్కా యిష్టం. వాళ్లావిడకు ధర్మవరం పట్టుచీర ఇష్టం. ఇంకా వాళ్ళ పిల్లలకు కావలసినవి కూడా ప్యాక్ చేసి వుంచాను. ఈవాళ ఆఫీస్ టైమ్‌కి ముందే ఆయన్ని బంగళాకెళ్ళి కలసిరండి''



''ప్రసాద్! నీవు నాకెన్ని విధాల సహాయం చేస్తున్నావో..నీ రుణం-''

''సర్, ఇది ఇక్కడ మామూలే! మొదటిరోజే మీకు చెప్పా. మేము మిమ్మల్ని, మీరు ఇ.ఇ గార్ని, మనమందరం ఎమ్మెల్యేలనీ మినిష్టర్లనీ..ఇలా వొకర్నొకరు గమనిస్తూ వుంటేనే మనమీ వలయంలో నిలబడగలం!''

ఎస్.ఆర్.బి.సి ఓ వలయమన్నమాట. రఘు ఆలోచిస్తున్నాడు. ఇంతలో ప్యూన్ వచ్చాడు. ''ఎంకట్రావుగోరు మిమ్మల్ని సూడాలటండీ'' చెప్పాడు.

''ఎవరు?'' రఘు అడిగాడు.

''వెంకట్రావ్ అంటే మన ఇరవై ఆరో అవుట్ లెట్ క్రింద భూస్వామి. ఛీఫ్ మినిష్టర్ వరకూ చేయుంది'' ప్రసాద్ చెబుతూండగానే, ఓ లావాటి వ్యక్తి లోపలి కొచ్చేసాడు. ముసలతనైనా కిళ్లీ నములుతూ హుషారుగా వున్నాడు.

''కొత్తగా వచ్చావంట, దర్శనం చేసుకుందామని...'' అతను కుర్చీలో కూచున్నప్పుడు, అతని లావాటి శరీరం, కుర్చీ చేతుల మధ్య బిగుసుకుపోతూంటే నవ్వాపుకున్నాడు రఘు.

''పదిహేనెకరాలు చెఱకు వేసామయ్యా, దాన్ని నీవే రక్షించాలి!'' అంటూ ఆ ఆసామి ఓ సంచిని రఘు ముందు పెట్టాడు. ''మా పొలాలకి రావాలంటే మీ కార్లూ జీపులూ పనిజేయవ్. అంచేత నీకో బహుమానం తెచ్చా. కొత్త బుల్లెట్టు! ఇదిగో కీలు!''

రఘు వాటిని అందుకోకుండానే ''చూడండి వెంకట్రావుగారూ..కెనాల్‌లో నీరు పూర్తిగా టెయిల్‌కి చేరితేగానీ మీకు నీళ్లు పంపలేము. వారం రోజులు పట్టొచ్చు'' చెప్పాడు.

''పంట ఎండిపోయాక పంపుతానన్నమాట'' అతను నవ్వాడు. ''అంతా నీ చేతుల్లోనే కదా వుంది. నీవు అనుకుంటే వారాన్ని దినంలా కుదించేగలవు.''

పది నిముషాల తర్వాత వెంకట్రావు వెళ్లాక ప్రసాద్ అన్నాడు.

''మహా చక్కగా టాకిల్ చేసారు సర్! వెంటనే నీళ్లిస్తామంటే నెత్తినెక్కుతారు. మనకి మర్యాద విలువుండదు. ఇస్తామని చెప్పకుండా చూద్దామనో, వీలుకాదనో అన్నామా..సాయంత్రంలోగా మినిష్టర్నుంచి, ఇ.ఇ గార్నుంచీ ఫోన్లు వస్తాయి.''

ప్రసాదు వెంకట్రావు వదలి వెళ్లిన సంచి తీసాడు. దాంట్లో రఘు పేర్న కొత్త బుల్లెట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, 'కీ'లు, ఇంకొన్ని కాయితాలున్నాయి. వాటిని రఘుకందిస్తూ, ''కార్లో ప్యాకింగ్స్ వున్నాయి. మీరు మొదట వెళ్ళి ఇ.ఇ గార్ని ప్రసన్నం చేసుకుని రండి. తర్వాత ఏదో రోజున ఆ వెంకట్రావు పొలానికి వెళ్లొచ్చు. బుల్లెట్ కలర్ బాగుంది సర్. న్యూమోడల్'' మెచ్చుకున్నాడు.

★★★

ఓ నెల ముందు రఘు తన జీవితంలో బుల్లెట్

కొనగలడని అనుకోలేదు. ఇప్పుడది ప్రజంట్‌గా అందింది! తన హోదాలో ఏమీ పెరగలేదు. అప్పుడు ఇప్పుడూ డెప్యూటీ ఎగ్జిక్యూటివే! కాని పోస్టింగ్‌లో ఎంత తేడా!!

రఘులో టెన్షన్ కర్పూరంలా కరిగిపోయింది. ఫ్రీగా మాట్లాడడం మొదలెట్టాడు.

డివిజన్‌కి ఫండ్స్ వచ్చిన విషయం చెప్పాడు. ఇ.ఇ పాతికలక్షలు ఎస్.ఆర్.బి.సి.కి కేటాయిస్తాడట. కాలవల నుంచీ మట్టి తీయడం, కాలవకి మరమ్మతులూ వెంటనే చేసేయమన్నాడు. ఆఖర్న మొహమాటమైనా పడకుండా ''రఘూ! పర్సెంటేజ్‌లో చాలా నిఖార్సయిన మనిషిని నేను! కలెక్ట్ చేసి ఇచ్చే బాధ్యత నీది!'' చెప్పాడు.

ప్రస్తుతం-కెనాల్ రన్ అవుతూంటే మరమ్మత్తులూ, సిల్టు తీసే పనీ ఎలా చేయాలో రఘుకీ పనుల్లో అనుభవం లేదు. బహుశా ఈ విషయాలు ప్రసాద్‌కు తెలిసుంటాయి. చివరకి రఘు ఇ.ఇ చెప్పింది ప్రసాద్‌కు వొప్పజెప్పాడు. తన అనుమానం బయట పెట్టలేదు.

''ఫండ్స్ వచ్చాయి ప్రసాద్! అర్జంటుగా కెనాల్సుకి రిపేర్లూ, సిల్టు తీసే పనీ చేయాలి. వారం-పదిరోజుల్లో పని పూర్తికావాలి. ఇ.ఇ చెప్పారు.''

ప్రసాద్ నవ్వాడు. రఘు అతనికి బాస్ అయినా, వాళ్లిద్దరి మధ్యా ఇప్పుడు ఆ సంబంధమే కాకుండా కాస్త స్నేహబంధం కూడా యేర్పడింది. అందుకే ప్రసాద్ వస్తున్న నవ్వునాపే ప్రయత్నం చేయలేదు.

రఘు అనుమానం తీర్చడానికి ప్రసాద్ చెప్పుకుపోయాడు. ''వీటిని మనం హోలో వర్క్సు అంటాం సర్. అంటే పనే వుండదు. పని జరిగినట్లు మేము- అంటే సెక్షనల్ ఇంజనీర్సు రికార్డు చేస్తాము. మీరు చెకింగ్ చూపిస్తారు. ఇ.ఇ గారు చెకింగ్ చూపకుండా 'చెక్' ఇస్తారు కాంట్రాక్టర్‌కు. కాంట్రాక్టర్ మీకు 60 శాతం ఇస్తాడు. అందులో మీది 20 శాతం. మిగిలిన 40 శాతం మీరు స్వయంగా తీసుకెళ్ళి, ఇ.ఇ గార్కి-ఇవ్వాలి. మీకు 60 శాతం ఇవ్వగా కాంట్రాక్టర్ దగ్గర 40 శాతం మిగిలుంటుంది. అందులో సగం తను వుంచుకుంటాడు. మిగిలిన సగాన్ని మేమూ, అకౌంటెంటూ, ఆడిటర్లూ పంచుకుంటాము. ఈ హోలో వర్క్సు ఎప్పుడోగానీ దొరకవు సర్. మీరొచ్చిన వేళావిశేషం మంచిది'' ప్రసాద్ క్షణం ఆగాడు- రఘు రియాక్షన్ కోసం.

చూస్తూ మళ్లీ చెప్పసాగాడు. ''సారీ సర్. నేను నవ్వడం మీ ఫీలింగ్స్‌ని హర్ట్ చేసి వుంటే నేను క్షంతవ్యుడ్ని..''

''అదేం లేదు ప్రసాద్''- రఘు తేరుకున్నాడు. అతని ముఖం నిండా అతనిలో అతని మీదే కలిగిన న్యూనతా భావం పులుపుకుని వుంది. ప్రసాద్ ''సారీ'' చెప్పాక అది క్రమంగా తిరిగి నవ్వుగా మారింది.

మరో మూడు రోజుల తర్వాత రఘుకి పన్నెండు లక్షల క్యాష్ అందింది. అది నల్లడబ్బు! అంత డబ్బు రఘు జీవితంలో ఎప్పుడూ చూసి వుండలేదు.

రఘుకిప్పుడు ఇ.ఇ.కి ఎంతివ్వాలన్నది ప్రశ్నగా తయారైంది. అడుగుదామంటే ప్రసాద్ కూడా లేడు. పదిహేను అందితే అందులోంచి పది ఇ.ఇ.కి ఇవ్వాల్సింది. కానీ ఇప్పుడు పన్నెండే అందాయి! కాంట్రాక్టరే తగ్గిస్తే తనేం చేయగలడు?

రఘు నాలుగు లక్షల్ని వేరు చేసి దాచేసి మిగిలిన ఎనిమిదింటిని బ్రీఫ్‌లో సర్దాడు. చీకటి పడేవరకూ ఆగి ఇ.ఇ బంగళాకెళ్లాడు. ఇ.ఇ ఎదురుచూస్తున్నాడు. రఘుని డ్రాయింగ్ రూంకి తీసుకెళ్ళి తలుపు వేసాడు. బ్రీఫ్‌కేసులోని కట్టలు లెక్క పెడుతూంటే అసహజమేదో జరిగినట్లు ముఖం మాడిపోయిందతనికి.

''ఇదేంటి? ఇట్ షుడ్ బి 40 పెర్సెంట్-పది లక్షలు! డోంట్యూనో స్టుపిడ్?''

కాసేపు రఘుకేం చెప్పాలో తోచలేదు. తర్వాత నెమ్మదిగా ''కాంట్రాక్టర్ పన్నెండే ఇచ్చాడు సర్..'' చెప్పాడు.

''యూ ఫూల్! డర్టీరోగ్!'' బ్రీఫ్‌కేసు విసిరికొట్టాడు ఇ.ఇ ''బ్రింగి మి టెన్...ఎల్స్ టేకిట్ ఆల్! నౌ గెటౌట్!''

రఘుకా అవమానం దుర్భరంగా తోచింది. తనేమీ నౌఖరు కాడు; సబార్డినేట్ ఆఫీసర్! కానీ ఏమీ చేయలేకపోయాడు. నోట్ల కట్టల్ని ఏరి బ్రీఫ్‌కేసులో సర్దాడు.

''క్షమించండి. నాకిక్కడ కొత్త..ఈ విషయాలు పూర్తిగా తెలియవు. దీన్నుంచండి. తతిమ్మా రెండు లక్షలు వెంటనే తెస్తాను.''

ఇ.ఇ వోడ్కా బాటిల్ తీసి రెండు గుక్కలు వేసుకున్నాడు. తాపీగా సిగరెట్ వెలిగించాడు. ''ఓ.కే వెళ్లి తీసుకురా. చూడూ, కాంట్రాక్టర్ నుండీ కలెక్ట్ చేయడం నీ బాధ్యత! నీవిక్కడ కొత్తయితే ఎవర్నయినా అడిగి తెలుసుకోవాలి. ఫాలోడ్?''

చిన్న పిల్లాడిలా తల వూపాడు రఘు.

★★★

''మార్చ్ ఎండింగ్!'' అది విశిష్టమైన కాలం! బడ్జెట్ కాలం! ఫండ్స్‌ని పక్వాన్నంగా వండి పంచుకునే పండుగ కాలం!! డివిజన్ ఆఫీసుకి రెండు కోట్లు ఫండ్సు వచ్చాయి.

ఇ.ఇ రఘుని పిలిపించాడు.

''ఫండ్స్ పదిరోజుల్లో ఖర్చుకావాలి..బట్ దిస్ టైం ఐ వాంట్ 50 పెర్సెంట్'' డిమాండ్ చేసాడు. రఘు ఇరకాటంలో పడ్డాడు. కాంట్రాక్టర్ ఇవ్వడమే 50 శాతం అయినప్పుడు అదెలా సాధ్యం? మరి తన వాటా?

''ఆ రామిరెడ్డి ఇస్తూండటమే 50 శాతం అండీ'' రఘు నసుగుడు.

''అదంతా నాకు తెలీదు. కాంట్రాక్టర్‌ని మార్చేయ్. వాడి నుంచీ 60 శాతం తీసుకో, 70 శాతం తీసుకో, నీ యిష్టం! కానీ నాకు మాత్రం 50 శాతం కావాలి!! నీవు వొప్పుకుంటే ఫండ్స్ నీకిస్తాను. లేదంటే నీకు తెలుసు-నా కంట్రోల్‌లో ఇంకా నాలుగు సబ్ డివిజన్స్ వున్నాయి. ఫండ్సు ఎవ్వరికైనా యివ్వగలను!''

రఘు ఆలోచించాడు. ఇ.ఇ.కి ఆ అధికారం వుంది! ఎంతో కొంత వచ్చేదాన్ని ఎందుకు పోగొట్టుకోవాలి?

''ఓకే సర్, ఫిఫ్టీ పర్సెంటు!'' రఘు వొప్పేసుకున్నాడు. ''కానీ, పాత కాంట్రాక్టరుకు టెండర్ ఇవ్వకండి.



### పృధ్వీ ఆలోచించాలి!

'పెళ్లి' చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు మంచి నటుడు దొరికాడనిపించాడు పృధ్వీరాజ్. ఆ తర్వాత కోడి రామకృష్ణ మరో చిత్రం 'పెళ్లిపందిరి'లో కూడా రాంక్ మార్కులు కొట్టేసిన పృధ్వీరాజ్ ఇటీవల నటించిన కొన్ని చిత్రాల్లో మరీ చిన్న చిన్న పాత్రలు పోషించడం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్న అతని కెరీర్‌కి స్పీడ్ బ్రేకర్స్‌లా అవుతాయనేది ఓ సందేహం. హీరోగానో, విలన్‌గానో ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్ పాత్రల్లో నటించడం ఎంతైనా ఉపయోగకరం. మొహమాటానికో మరెందుకో చిన్నా చితకా పాత్రల్లో నటించడం వల్ల ఒరిగేదేమీ లేదు కదా. ఆఫ్‌కోర్స్ పాత్ర పవర్‌ఫుల్ దైతే ఆ గుర్తింపు ఎలాగూ వస్తుంది. కానీ పృధ్వీరాజ్ లాంటి నటుడు నటించడానికి స్కోప్ వుండే పాత్రలు అయితేనే పదికాలాల పాటు అతని సినీ కెరీర్ పచ్చగా వుంటుంది. ఈ సంగతి బాలనటుడి స్థాయి నుంచి ఈనాడింతటి స్థాయికి ఎదిగిన పృధ్వీకి తెలియనిది కాదు.

-జె.ఎం.

మోసం చేసాడు. అసలు ఏ టెండరూ ఇవ్వకండి. వాడికి పనిష్మెంట్ ఇస్తేనే వేరేవాళ్లు లైన్‌లోకి వస్తారు.''

''ఎస్ ఐనో ఇట్!'' ఇ.ఇ వొప్పుకున్నాడు. ''టెండర్ ఎవ్వరికివ్వాలన్నది నీవే చూడు. కానీ జాగ్రత్త! మనిషి రిలయబుల్‌గా వుండాలి. కలక్షన్ బాధ్యత నీది! వన్ క్రోర్ ఫండ్స్ ఎస్.ఆర్.బి.సి.కి అలాట్ చేస్తాను! ఐలైక్ యువర్ సిన్సియారిటీ!''

రఘుకు అర్థమైంది. అసలు విషయం తన సిన్సియారిటీ కాదు! ఇ.ఇ తన దగ్గర మాత్రమే 50 శాతం గుంజబోతున్నాడు. తతిమ్మా అందరి దగ్గరా నలభయ్యో, లేక ఇంకా తక్కువ కావచ్చు. తను కొత్త కావడం మూలాన అందరూ తనని మోసం చేస్తూండొచ్చు. ఈసారి రఘు కాంట్రాక్టర్ మోసం చేయడానికి వీల్లేకుండా పగడ్బందీ ఏర్పాటు చేసాడు. టెండర్ని తన మామగారు రాఘవులకి పరిచితుడైన కాంట్రాక్టర్ పేర్న ఇచ్చాడు.

★★★

ఫండ్స్ అందడమే ఆలస్యం. తరువాత కార్యక్రమాలు క్రమం తప్పకుండా యాంత్రికంగా జరిగిపోతూంటాయి. ఎస్టిమేట్లు, టెండర్లు, ఎమర్జెన్సీ రిపేర్లు, బిల్స్ అన్నీ చూస్తూ జరిగిపోతాయి. బిల్లు డివిజన్ చేరేవరకూ ఒకటే హడావిడి. తర్వాత బిల్స్ పాస్ అయి, పర్సెంటేజ్ చేతిలో పడేవరకూ ఒకటే అలజడి. పదిరోజులు ఎలా గడిచాయో తెలీలేదు. డబ్బు చేతిలో పడేవరకూ రఘు క్షణం కునుకు తీయలేదు!

★★★

రఘు మారుతి లోంచి రెండు బ్రీఫ్‌కేసులతో దిగాడు. అప్పటికే చీకటి పడింది. సరోజ ఇంట్లో ఎదురుచూస్తోంది. ఆమెకు వాటిలో ఏముందో తెలుసు! అరవై లక్షల నల్లడబ్బు! అందులో తమది పది లక్షలు మాత్రమే! అయితేనేం?


హాల్లోకి వస్తూనే సరోజ ఏదో చెప్పబోయింది. సరిగ్గా అప్పుడే ఫోన్ మ్రోగింది. రఘు తీసుకున్నాడు.

''మెసేజ్ ఎప్పుడో అందింది. ఈసరికి నీవు రావలసింది'' ఇ.ఇ స్వరం కటువుగా వినిపిస్తోంది.

''వస్తున్నా సార్..అరగంటలో చేరుకుంటా'' రఘు చెప్పాడు. ఫోన్ పెట్టేసి ''సరూ!'' పిలిచాడు.

''ఏంటండీ?''

''నిన్నమొన్నటి వరకూ ఆరువేల జీతమే మనకెంతో అపురూపం అనిపించేది! అయినా తెగించి ఆస్తంతా అమ్మి ఆరు లక్షలు ఖర్చుచేసి ఇక్కడొచ్చి పడ్డాం! ఇప్పుడు కావలసినంత డబ్బు! కానీ ఎందుకో ఇక్కడ సుఖం లేదు. మనశ్శాంతి లేదు. దుర్భరమైన




జీవితం ఇది! అనుక్షణం భయం! అనుమానం, అవమానం, ఆందోళన...ఇదో నరకం! ఆరితేరిన మోసగాళ్లు, మొండి ఘటాలైతేనే దీన్ని భరించగలరు- మా ఇ.ఇ లాంటివాళ్లు! వాడెంత దరిద్రుడో తెలుసా? వాడికి డబ్బు కావాలి! కానీ కాంట్రాక్టర్ నుంచీ డైరక్ట్‌గా తీసుకోవడం కూడా రిస్కు అనుకుంటాడు. నేను తీసుకెళ్లి వాడికివ్వాలి!

ఏదైనా ఎంక్వయిరీ వస్తే మెజర్‌మెంట్స్‌పై చెకింగ్ చూపడు కాబట్టి వాడికి రిస్కు లేదు. హండ్రడ్ పర్సెంటు చెకింగ్ చూపిన నేను మాత్రం పూర్తిగా ఇరుక్కుపోతాను! కానీ నా పర్సెంటు పదే! వాడిది యాభై! ఇక్కడి జీవితాన్ని ప్రసాద్ వలయం అంటూంటాడు! కానీ ఇది మామూలు వలయం కాదు. సుడిగుండం! ఈ వలయం లోంచి తప్పుకోవాలి సరూ! నాకు తెగించాలని వుంది. పట్టుబడితే అంతా పట్టుబడతారు. ఇప్పుడు నా చేతిలో అరవై లక్షలుంది! దీనికి అకౌంటు లేదు! నా దగ్గరున్న ప్రూఫ్ లేదు! దీన్ని తీసుకుని వుద్యోగం వదిలేసినా జీవితాంతం సరిపోతుంది! సరూ, నీకు చెప్పలేదుగానీ ఎప్పట్నుంచో నాకీ ఆలోచన వుంది! మనం తక్షణం వెళ్ళిపోదాం. మీ వూరికో, మా వూరికో..ప్రస్తుతం ఇక్కడ్నుంచీ దూరంగా ఎక్కడో ఓచోటకి! మెడికల్ లీవు పంపేద్దాం! తర్వాత తీరిగ్గా రాజీనామా గురించి ఆలోచించొచ్చు. ఏమంటావు?''

''నాకు భయం వేస్తోంది!'' సరోజ అంది. ''అందులోనూ వున్న వుద్యోగానికి రాజీనామా ఇవ్వడం- బంగారు గుడ్లు పెట్టే బాతుని అత్యాశకు పోయి...''

రఘు మధ్యలోనే అడ్డుపడ్డాడు. ''ఇక్కడి బాతులు చాలా చాలా డేంజరస్ సరూ...ఏదోరోజున నన్నే చంపి తినేయగలవు?''

పావుగంట తర్వాత రాజీ పడింది సరోజ.

సరిగ్గా బయలుదేరేముందు ఫోన్ మోగింది.

''వై ఆర్ యూ లేట్?'' ఇ.ఇ స్వరం కర్కశంగా వినిపించింది.

''సర్..అంత క్యాష్‌తో చీకట్లో రావడం భయంగా వుంది.''

''షటప్! ఐ ఎక్స్‌పెక్ట్ యు ఇన్ ఫిఫ్టీన్ మినిట్స్- స్ట్రిక్ట్‌లీ!''

అవతల క్లిక్ అయింది. రఘు ఫోన్ పెట్టేశాడు.

పది నిముషాల్లో ఇద్దరూ బయలుదేరారు. మారుతీలో వారితోపాటూ రెండు బ్రీఫ్ కేసులున్నాయి. ఓ సూట్‌కేస్‌లో కొన్ని బట్టలు సర్దుకున్నారు. అంతే! కారు కాలనీ దాటుతోంటే రఘుకి నవ్వొచ్చింది. ''పాపం, మా ఇ.ఇ గాడు నాకోసం ఎదురు చూస్తూంటాడు! ఓ రెండు గంటల తర్వాత వాడికి విషయం తెలిసిపోతుంది! లేక ఉదయం దాకా ఎదురు చూస్తాడో'' రఘు నవ్వులో సరోజ శృతి కలిపింది.

★★★

ఆరు గంటల నుంచీ ఏకధాటిగా 60-100 స్పీడులో డ్రయివ్ చేస్తున్నాడు రఘు. తెల్లవారు ఝాము మూడు గంటలవుతోంది. మధ్యలో భోజనం కూడా చెయ్యలేదు. ఇంకో రెండు గంటల్లో గమ్యస్థానం చేరుకుంటాడు రఘు. ఆచోటు ఎవ్వరూ వూహించలేనిది. ఎవరికీ అనుమానం రానిది. అక్కడ డబ్బు దాచేసి తాము తిరుపతి వెళ్లిపోతారు. అదీ ప్లాను!

సడన్‌గా ఓ మోటార్ సైకిల్ ఓవర్‌టేక్ చేస్తూ దూసుకుపోయి రోడ్లో అడ్డంగా ఆగింది. సడన్ బ్రేక్ వేశాడు రఘు. గాఢ నిద్రలో వున్న సరోజ వులిక్కిపడి లేచింది. వెనక నుంచీ ఓ మెటాడార్ వచ్చి ఆగింది. సరోజకింకా నిద్రమత్తు తొలగలేదు. అయిదారుమంది మారుతిని చుట్టేశారు. ఒకడు కారు డోర్ లాగేసాడు. ఇంకోడు కత్తి తీసాడు. సరిగ్గా అప్పుడే మెటడార్ హెడ్‌లైట్స్ ఆరిపోయాయి.

''డబ్బెక్కడ దాచావ్?'' ఎవడో అడిగాడు.

రఘు ఏదో చెప్పాడు. అంతే! మరుక్షణం భయంకరంగా గావుకేక పెట్టాడు! సరోజ ముఖం మీద ఏదో వెచ్చగా చిమ్మింది! రఘు మూల్గుతూ ఆమె వొడిలో పడి గిల గిల్లాడుతున్నాడు. సరోజకు స్పృహ తప్పింది.

★★★

రాఘవులు కాలుతున్న రెండు శవాలని చూస్తున్నాడు. మనస్సు మాత్రం ఎక్కడో ఆలోచిస్తోంది! ఇలా జరగడానికి కారణం తనా? లేదా ఆ పరిస్థితులకి ఇమడలేని అల్లుడా? ఏదైనా, చక్కగా సంసారం చేసుకుంటున్న వాళ్లని తనే ఓ విష వలయంలోకి లాగాడు! కూతురి తీపి గురుతుగా మిగిలిన బాబుని గుండెలకు హత్తుకున్నాడు. అది వలయం కాదు సుడిగుండం!

★